కాంగ్రెస్ హామీలన్నీ గాలికే!

- ఎన్నికల హామీలకు రాజస్థాన్ కాంగ్రెస్ సర్కారు తూట్లు
- ఏ ఒక్కటీ సంపూర్ణంగా నెరవేర్చని గెహ్లోట్ ప్రభుత్వం
- జాబితాలో రుణమాఫీ, నిరుద్యోగ భృతి, పింఛన్లు రూపాయికే కిలో గోధుమలు, పెట్రో ధర తగ్గింపు
- సీఎం కుర్చీపైనే ధ్యాస.. సంక్షేమం గాలిమాట
- ప్రజల్లో అంతకంతకూ పెరుగుతున్న వ్యతిరేకత



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): రాజస్థాన్‌లో అధికారాన్ని చేపట్టి ఐదేండ్లైనా ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదాన్నీ కాంగ్రెస్ పార్టీ పరిపూర్ణంగా అమలుచేయలేదు. 2018 ఎన్నికల వేళ జన్ ఘోష్నా పత్ర పేరిట రాజస్థాన్‌లో కాంగ్రెస్ మ్యానిఫెస్టో తీసుకొచ్చింది. 2 లక్షల వరకు రుణమాఫీ, ఉచిత విద్యుత్తు, యువతులకు ఉచిత విద్య, 3,500 నిరుద్యోగ భృతి, రూపాయికే కిలో గోధుమలు, పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు, ప్రతి పంచాయతీకి ఇంటర్నెట్ సదుపాయం తదితర హామీలిచ్చిన ఆ పార్టీ వాటి అమలులో చేతులెత్తేసింది. డిప్యూటీ సీఎం సచిన్ పైలట్‌తో వర్గ పోరు కారణంగా ఆ రాష్ట్ర సీఎం అశోక్ గెహ్లోట్ తన పదవిని కాపాడుకోవడానికే సరిపోయారు. కాంగ్రెస్ ధ్యాసంతా సీఎం కుర్చీమీదనే ఉన్నదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత విద్యుత్తు తీరు ఇలా..

వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ సర్కారు.. దాన్ని అమలు చేయడం అటుంచి అధికారంలోకి వచ్చీ రాగానే విద్యుత్తు చార్జీలను అమాంతం పెంచేసింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. రానున్న ఎన్నికల్లో పార్టీ తిరిగి పగ్గాలు చేపట్టడం కష్టమని తేలడంతో కాంగ్రెస్‌కు హఠాత్తుగా వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు అంశం గుర్తుకు వచ్చింది. బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రి గెహ్లోట్ 'చీఫ్ మినిస్టర్ ఎలక్ట్రిసిటీ ఫర్ ఫార్మర్' పేరుతో పథకం ప్రకటించారు. 2 వేల యూనిట్ల వరకే ఈ స్కీమ్ వర్తిస్తుందని మెలిక పెట్టారు. దీంతో 58 లక్షల మంది రైతుల్లో చిన్న కమతాలున్న 11 లక్షల మందికి మాత్రమే ఈ స్కీమ్ ద్వారా లబ్ధి చేకూరనున్నది. స్కీమ్ ప్రారంభం కాగానే, గృహ వినియోగ విద్యుత్తు యూనిట్‌పై 30 పైసలు చార్జీని ప్రభుత్వం పెంచింది. ఆ తర్వాత మరో 45 పైసల వాత విధించింది.

అటకెక్కిన రుణమాఫీ

మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో మొత్తం 23.5 లక్షల రైతులకు సంబంధించి రుణమాఫీ చేయాల్సి ఉంది. అయితే, 59 వేల మంది రైతులకు సంబంధించిన రూ.409 కోట్ల రుణాలు మాఫీ చేసినట్టు మంత్రి ఉదయపాల్ అంజనా అసెంబ్లీలో వెల్లడించారు. ఇదే రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. గత ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 10 రోజుల్లో రైతు రుణాలన్నింటినీ మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, సహకార బ్యాంకుల్లో రూ. 2 లక్షల వరకు తీసుకున్న పంట రుణాలను మాత్రమే ప్రభుత్వం రద్దు చేసింది. జాతీయ, వాణిజ్య బ్యాంకుల్లో రైతులు తీసుకొన్న రుణాలకు తమకు సంబంధం లేదని ఏవేవో కారణాలను వల్లె వేసింది. రుణమాఫీ చేయకపోవడంతో అనేక మంది రైతులు తనువు చాలించారు. దీనిమీద రైతుసంఘాలు, విపక్షాలు మండిపడ్డాయి. 90 శాతం రైతులకు రుణమాఫీ పథకం వర్తించలేదని వామపక్షాల ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కిసాన్ సభ ఆరోపించింది. రుణమాఫీకి ప్రభుత్వం విధించిన షరతులు దారుణంగా ఉన్నాయని మండిపడింది

మిగతా హామీలు ఇలా..

ఐదేండ్లపాటు వృద్ధుల పింఛన్ పెంపును పక్కనబెట్టిన సర్కారు ఇటీవలే ఆ మొత్తాన్ని రూ. వెయ్యికి పెంచింది. ఇదేసమయంలో కనీస వయసు 75 ఏండ్లు నిండి ఉండాలని మెలిక పెట్టింది. నిరుద్యోగులకు రూ. 3,500 భృతి ఇస్తామన్న సర్కారు.. దాన్ని రూ. 3 వేలకు తగ్గించింది. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా 33 లక్షల మంది నిరుద్యోగులు ఉంటే కేవలం లక్ష మందికే అదీ ఒక్క నెల మాత్రమే భృతిని పంపిణీ చేసింది. యువతులకు ఉచిత విద్యకు సంబంధించి లబ్ధిదారుల సంఖ్యను భారీగా తగ్గించేశారు. యువతకు సులభతర రుణాలు ఇప్పించడంలో ప్రభుత్వం చొరవ చూపలేదు. పెట్రోల్, డీజిల్ ధరలు అంతకంతకు పెరిగిపోయాయి. తగ్గిస్తామన్న హామీని తుంగలో తొక్కారు. రూపాయికే కిలో గోధుమల కోసం ప్రజలు కండ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లను జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చేలా కృషి చేస్తానని మ్యానిఫెస్టోలో ప్రకటించగా.. అది కూడా అమలు కాలేదు.

కాంగ్రెస్‌ది మోసం..దగా!

- ఎస్పీ అధినేత అఖిలేశ్ ఆక్రోశం
- విపక్ష పార్టీల 'ఇండియా' కూటమిలో టికెట్ల చిచ్చు
- మధ్యప్రదేశ్ ఎన్నికల బరిలో సమాజ్‌వాదీ అభ్యర్థులు
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 'పీడీఏ'దే విజయం
- అఖిలేశ్ తాజా వ్యాఖ్యలపై చర్చ
- కూటమిలో సమాజ్‌వాదీ పార్టీ కొనసాగడంపై నీలినీడలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): ఇండియా కూటమి ఆవిర్భావం తర్వాత తొలిసారిగా ఐదు రాష్ట్రాలకు జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలతోనే ఆ కూటమి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నది. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల మధ్య తలెత్తిన విభేదాలు కూటమిలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆదివారం ఎక్స్ పోస్టులో చేసిన ఓ కీలక వ్యాఖ్య కూటమికి బీటలు బారుతున్నాయన్న సంకేతాన్ని ఇస్తున్నాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికలలో పీడీఏ(వెనుకబడిన వర్గాలు, దళితులు, అల్పసంఖ్యాక వర్గాలు) విజయం సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా వచ్చే లోక్ సభ ఎన్నికలలో 'ఇండియా' కూటమి ఉండదన్నట్టుగా అఖిలేశ్ పరోక్ష సంకేతాలు ఇచ్చారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఇండియా కూటమికి బీటలు

ఏ ఎన్నికలు వచ్చినా కలిసి పనిచేయాలని ఇండియా కూటమిలోని కాంగ్రెస్‌కు, ఇతర పార్టీలకు మధ్య ప్రాథమిక అవగాహన కుదిరింది. అయితే మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తమకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం పట్ల ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ తీవ్రంగా మండిపడుతున్నారు. మిత్ర ధర్మాన్ని కాంగ్రెస్ పార్టీయే పాటించకపోతే అందులో ఇతర పక్షాలు కొనసాగడంలో అర్థం లేదని అంటున్నారు. ఇదే విషయాన్ని తమకు ముందే చెప్పి ఉంటే కూటమిలో చేరాలా? వద్దా? అని నిర్ణయం తీసుకునే వారమని కాంగ్రెస్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌ది పచ్చి మోసం

మధ్యప్రదేశ్‌లో ఎస్పీకి ఐదు సీట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి ఒక్కటి కూడా ఇవ్వకుండా 230కిగానూ 229 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించేసింది. దీని ద్వారా కూటమిలోని ఇతర పార్టీలను కాంగ్రెస్ 'ఫూల్స్' చేసిందని అఖిలేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ పెద్దలు దిగ్విజయ్‌సింగ్, కమల్‌నాథ్ తమ పార్టీ నేతలను చివరి వరకు చుట్టూ తిప్పుకొని చివరికి మొండిచేయి చూపారని మండిపడ్డారు. రేపటి రోజున ఉత్తరప్రదేశ్‌లో వారికి ఇదే పరిస్థితి ఎదురుకాక తప్పదని హెచ్చరించారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ తమకు సీట్లు ఇవ్వనప్పుడు.. తాము కూడా అదేవిధంగా చేస్తే తప్పేమంటని అఖిలేశ్ అన్నారు.

కూటమిలో ఐక్యత ఇదేనా?

వచ్చే సార్వత్రిక ఎన్నికలలో బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా ఏర్పడిన ఇండియా కూటమిలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అప్పుడే విభేదాలు బయటపడ్డాయి. కూటమి ఏర్పాటు సమయంలో కనిపించిన ఐక్యత.. ఎన్నికల సమయం వచ్చే సరికి లేదనే దానికి కాంగ్రెస్-ఎస్పీ మధ్య తలెత్తిన విభేదాలే నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మధ్యప్రదేశ్‌లో మొత్తం 230 సీట్లకుగాను ఒక్క సీటు మినహాయించి కాంగ్రెస్ అన్నింటిలో అభ్యర్థులను ప్రకటించింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎస్పీ కూడా పోటాపోటీగా తన అభ్యర్థులను ప్రకటించింది.

రాజస్థాన్ బీజేపీలో భగ్గుమన్న అసమ్మతి

టికెట్ రాని ఆశావహుల బీభత్సం

జైపూర్, అక్టోబర్ 22: రాజస్థాన్ బీజేపీలో అసమ్మతి భగ్గుమంది. వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో టికెట్లు రాని పలువురు ఆశావహులు అధిష్ఠానం తీరుపై మండిపడ్డారు. పార్టీ కార్యాలయాలపై దాడి చేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. తర్వాత అక్కడ ఉన్న ఎన్నికల ప్రచార సామగ్రిని రోడ్‌పై వేసి టైర్లతో పాటు వాటిని దహనం చేశారు. ముఖ్యంగా చిట్టఘర్, ఉదయ్‌పూర్, కోట, జైపూర్, అల్వార్, బూంది నియోజకవర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ దిష్టిబొమ్మలను దహనం చేశారు. వీరిలో కొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉండగా, మరికొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ టికెట్ ఇవ్వడంపై నిరసన వ్యక్తం చేశారు. రాజస్‌మండిలో టికెట్లు రాని బీజేపీ నేతలు దినేశ్ బదలా, గణేశ్ పలివాల్, మహేంద్ర కొఠారి తమ అనుచరులు, బీజేపీ కార్యాలయంలోని ఫర్నిచర్ ఇతర సామగ్రిని ధ్వంసం చేస్తూ, వాటిని రోడ్‌మీదకు విసిరేస్తూ బీభత్సం సృష్టించారు. అలాగే ఉదయ్‌పూర్ టికెట్‌ను అశించిన డిప్యూటీ మేయర్ పారస్ సింఘ్వీ, చిట్టఘర్‌లో సిట్టింగ్ ఎంఎల్‌ఏ చంద్రభన్ సింగ్ ఆఖ్యా, జైపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే అశోక్ లాహోటి, కోటా సౌత్‌లో వికాశ్ శర్మ నిరసన తెలిపారు. ఇక బూందిలో అశోక్ డోగ్రాకు టికెట్ కేటాయింపుపై నిరసన వ్యక్తం అయ్యింది.

బుందేల్‌ఖండ్ జై కొట్టేదెవరికో?

- మధ్యప్రదేశ్ రాజకీయాల్లో కీలక ప్రాంతం
- రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన రీజియన్
- 20 ఏండ్లుగా బీజేపీకి పెట్టని కోట
- అయినా అభివృద్ధి శూన్యం.. ఆగని వలసలు



భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పుడు బుందేల్‌ఖండ్ ప్రాంతం అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. అసలే వెనుకబడిన మధ్యప్రదేశ్‌లో అంతకంటే వెనుకబడిన ప్రాంతంగా బుందేల్‌ఖండ్‌కు పేరున్నది. పేదరికం, కరువు, కులాల కొట్లాటకు ఈ ప్రాంతం చిరునామా అని చెప్తారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ సరిహద్దుల్లో ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న ఈ ప్రాంతంలో 26 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇక్కడ గత 20 ఏండ్లుగా బీజేపీనే ఆధిపత్యం వహిస్తూ వస్తున్నది. అయినా పేదరికమూ పోలేదు.. ప్రజల రాత మారలేదు.

కాచుకొని కూర్చున్న ఎస్పీ, బీఎస్పీ

యూపీకి సరిహద్దుగా ఉండటంతో బుందేల్‌ఖండ్‌పై సమాజ్‌వాదీ (ఎస్పీ), బహుజన్ సమాజ్ (బీఎస్పీ) పార్టీల ప్రాబల్యం కూడా అధికంగా ఉన్నది. మొత్తం 26 స్థానాల్లో ఆరు ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలున్నాయి. ఎస్పీ, బీఎస్పీ ఎక్కువ సీట్లు గెలువలేకపోయినా ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు అవకాశాలను తారుమారు చేయగలవని గత ఎన్నికల్లో నిరూపించాయి. 2018లో ఇక్కడ బీజేపీ 16, కాంగ్రెస్ 8, ఎస్పీ, బీఎస్పీ ఒక్కో సీటు గెలుచుకొన్నాయి. తర్వాత బీజేపీ బలం 18కి పెరగ్గా, కాంగ్రెస్ 7కు పడిపోయింది.

వలస బతుకుల అడ్డా

బుందేల్‌ఖండ్ అనగానే ముందుగా గుర్తొచ్చేది కరువు, వలసలు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ఈ ప్రాంతం మాత్రం పేదరికాన్ని జయించలేకపోయింది.

కేంద్రంలో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు బుందేల్‌ఖండ్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేయటంతో కేంద్రం రూ.7 వేల కోట్లతో అభివృద్ధి ప్యాకేజీ ఇచ్చింది. అయినా, పేదరికం పోలేదు. వలసలు ఆగలేదు. బీజేపీ పాలనలో బుందేల్‌ఖండ్ మరింత పేదరికంలోకి జారుకున్నదని నివేదికలు చెప్తున్నాయి. 2003లో మధ్యప్రదేశ్ సీఎంగా పనిచేసిన ఉమాభారతి ఈ ప్రాంతానికి చెందినవారే. అయినా, బుందేల్‌ఖండ్ రాత మారలేదు. బుందేల్‌ఖండ్‌ను అన్నిపార్టీలూ ఓట్లకోసం వాడుకొన్నాయే తప్ప.. ప్రజల ఆకలి బాధలు తీర్చాలని ప్రయత్నించలేదని సీనియర్ జర్నలిస్టు రషీద్ కిద్వాయ్ ఆవేదన వ్యక్తంచేశారు.

ఎన్నికల ఫండింగ్ కోసమే!

- కర్ణాటకలో కృత్రిమ విద్యుత్తు కొరత సృష్టిస్తున్న కాంగ్రెస్ సర్కారు
- ప్రైవేట్ కంపెనీల నుంచి విద్యుత్తు కొనుగోలు ద్వారా భారీగా కమీషన్లు
- మాజీ సీఎం కుమారస్వామి ఆరోపణలు
- ప్రజలు సమస్యలతో అల్లాడుతుంటే కర్ణాటక నీరో క్రికెట్ చూస్తున్నారు
- సీఎం సిద్ధరామయ్యపై ఆగ్రహం

బెంగళూరు, అక్టోబర్ 22: కర్ణాటకలో నెలకొన్న విద్యుత్తు సంక్షోభంపై ఆ రాష్ట్ర మాజీ సీఎం, జేడీఎస్ నేత కుమారస్వామి సంచలన ఆరోపణలు చేశారు. కమీషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వమే రాష్ట్రంలో కృత్రిమ విద్యుత్తు కొరత సృష్టిస్తున్నదని ఆరోపించారు. ప్రైవేట్ విద్యుత్తు సంస్థల నుంచి కరెంట్ కొనుగోలు చేయడం ద్వారా ఆ సంస్థల నుంచి భారీగా కమీషన్లు దండుకొని, ఆ సొమ్మును రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల కోసం తమ పార్టీ అధిష్ఠానానికి ఫండింగ్ చేసేందుకు సిద్ధరామయ్య సర్కారు ఇలా చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుమారస్వామి శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. విద్యుత్తు కొనుగోళ్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పలు వనరుల నుంచి విద్యుత్తు ఉత్పత్తికి పుష్కలమైన అవకాశం ఉన్నప్పటికీ, కృత్రిక కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు.

కమీషన్ల వసూలుకు అధిష్ఠానం ఒత్తిడి

'విద్యుత్తు శాఖ మంత్రి కేజే జార్జి దగ్గర డబ్బుకు కొరత లేదు. అయితే కమీషన్లు వసూలు చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనపై ఒత్తిడి చేస్తుండచ్చేమో! విదేశాల నుంచి బొగ్గు కొనుగోలును ఆయన ప్రకటించారు' అని కుమారస్వామి అన్నారు. 'పథకాల ద్వారా డబ్బును లూటీ చేసేందుకు అవసరమైన వాతావరణం ఏ విధంగా సృష్టించాలో కాంగ్రెస్ సర్కార్‌కు బాగా తెలుసు. విదేశాల నుంచి అధిక ధరలకు బొగ్గును దిగుమతి చేసుకొనేందుకు ప్లాన్ చేస్తున్నది' అని ఆరోపించారు. రాష్ట్రంలో 15 మెగావాట్ల విద్యుత్తు కొరత ఎదుర్కొంటున్నదని, విద్యుత్తును కొనుగోలు చేయాల్సిన అవసరం ఉన్నదని సీఎం సిద్ధరామయ్య చెప్పారని, అయితే ప్రభుత్వం గత ఐదు నెలలుగా నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నదని, సంక్షోభానికి ప్రభుత్వ చర్యలే కారణమని విమర్శించారు. ఇటీవల కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ప్రపంచ కప్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించడంపై కుమారస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రోమ్ తగలబడుతుంటే నీరో వయోలిన్ వాయించాడట! ఇక్కడ ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే కర్ణాటక నీరో(సీఎం) క్రికెట్ మ్యాచ్ చూస్తున్నారు' అని ఆయన విమర్శించారు.

సామర్థ్యం ఉన్నా కావాలనే..

రాష్ట్రంలో విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యానికి సంబంధించిన గణాంకాలను కుమారస్వామి ఈ సందర్భంగా వివరించారు. 3,906.6 మెగావాట్ల హైడ్రో పవర్, థర్మల్ ప్లాంట్ల నుంచి 5,020 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే సామర్థ్యం మనకు ఉన్నదని, ప్రైవేటు ఉత్పత్తిదారుల నుంచి 2,050 మెగావాట్లు వస్తుందని, పునరుత్పాదక వనరుల నుంచి 17,848.74 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని, అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం నుంచి 2,877.56 మెగావాట్ల విద్యుత్తు వస్తుందని పేర్కొన్నారు. కుమారస్వామి ఆరోపణలపై స్పందించిన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్.. తాము ఆయన వ్యాఖ్యలను పట్టించుకోమని అన్నారు. రైతులపై వారికి శ్రద్ధ ఉంటే అధికారంలో ఉన్న సమయంలో ఏమైనా చేసే వారని పేర్కొన్నారు.

చేయని నేరానికి 36 ఏండ్ల శిక్ష.. 400 కోట్ల పరిహారం

వాషింగ్టన్: అమెరికాలో ఒక హత్య కేసులో అరెస్టయ్యి 36 ఏండ్లు శిక్ష అనుభవించిన ముగ్గురు వ్యక్తులు నిర్దోషులుగా తేలడంతో జరిగిన నష్టానికి ప్రభుత్వం వారికి 48 మిలియన్ డాలర్లు (సుమారు రూ.400 కోట్లు) పరిహారంగా చెల్లించనున్నట్టు ద వాషింగ్టన్ పోస్ట్ వెల్లడించింది. ఆల్‌ఫ్రెడ్ చెస్ట్‌నట్, రాంసమ్ వాట్‌కిన్స్, ఆండ్రూ స్టీవర్ట్ 16 ఏండ్ల వయసులో ఉండగా 1983లో ఒక హత్యకేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిపై రీ అప్పీల్ చేశారు. అప్పట్లో తమ కేసు దర్యాప్తు చేసిన అధికారులు ప్రత్యక్ష, భౌతిక ఆధారాలను విస్మరించారని ఆరోపించడమే కాక, దానిని రుజువు చేయడంతో 2019లో వీరిని విడుదల చేస్తూ ఆదేశాలిచ్చారు.

రాజస్థాన్‌లో ప్రచారాస్త్రంగా ఈఆర్‌సీపీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబరు 22 (నమస్తే తెలంగాణ): రాజస్థాన్ శాసనసభ ఎన్నికల్లో ఈస్ట్రర్న్ రాజస్థాన్ కెనాల్ ప్రాజెక్ట్(ఈఆర్‌సీపీ) ప్రచారాస్త్రంగా మారింది. 19 జిల్లాల్లోని 2.8 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించే ఈ ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వడం లేదని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. తాము రాష్ట్ర బడ్జెట్‌లో నిధులను కేటాయించామని చెప్తున్నారు. రాష్ట్రంపై బీజేపీ వివక్ష చూపుతున్నదని ప్రచారం చేస్తున్నారు. దీనిపై కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు స్పందిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలను పంపించలేదని, ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపిస్తున్నారు.

ముంచుకొస్తున్న జంట తుఫానులు

- *అరేబియా సముద్రంలో తేజ్, బంగాళాఖాతంలో హమూన్*
- *భారత వాతావరణ విభాగం వెల్లడి*

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): దేశంలో ఒకేసారి రెండు తుఫాన్లు ముంచుకొస్తున్నాయి. అరేబియా మహాసముద్రంలో తేజ్ తుఫాన్, బంగాళాఖాతంలో హమూన్ తుఫాన్ ఏర్పడినట్టు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. తేజ్ తుఫాన్ ఆదివారం తీవ్ర తుఫానుగా మారి యెమెన్-ఒమన్ తీరాల వైపు పయనిస్తున్నట్లు ఐఎండీ తెలిపింది. ఈ తుఫాన్ వాయువ్య దిశగా కదిలి, ఆల్‌గైదా (యెమెన్), సలాలా (ఒమెన్) మధ్య తీరం దాటుతుందని అంచనా వేసింది. తుఫాన్ తీరం దాటే సమయంలో గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. తీరరేఖకు ఇరువైపులా ఒకేసారి రెండు తుఫానులు సంభవించడం చాలా అరుదని వాతావరణ నిపుణులు తెలిపారు. చివరి సారిగా 2018లో ఇలాంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. హమూన్ తుఫాను ఆంధ్రప్రదేశ్ తీరం దిశగా కదులుతున్నది. మరి కొన్ని గంటల్లో ఇది తీరం దాటే అవకాశం ఉందని, కేరళ, తమిళనాడులోని చాలా ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదవుతాయని చెప్పారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తెలంగాణపై ఈశాన్య రుతుపవనాల ప్రభావం

ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి సూచికగా తమిళనాడులో శనివారం నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయని ఐఎండీ తెలిపింది. తెలంగాణలోనూ రెండు రోజుల్లో ఈశాన్య రుతుపవనాలు ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేసింది.



గగన్‌యాన్‌లో మహిళలకు ప్రాధాన్యం

ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి

తిరువనంతపురం : మానవ సహిత అంతరిక్ష యాత్ర కోసం ఇస్రో చేపట్టిన గగన్‌యాన్ ప్రాజెక్టులో మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని ఇస్రో చైర్మన్ సోమనాథ్ చెప్పారు. మహిళా ఫైటర్ టెస్ట్ పైలట్లను, మహిళా శాస్త్రవేత్తలను ఇందులో భాగస్వాములను చేస్తామన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మానవ సహిత అంతరిక్ష యాత్ర 2025 నాటికి చేపట్టవచ్చన్నారు. మహిళా ఫైటర్ టెస్ట్ పైలట్లు మనకు లేరని, అందుకోసం ఎయిర్‌ఫోర్స్ ఫైటర్ టెస్ట్ పైలట్లను తీసుకుంటామన్నారు. వీరిద్దరికీ కేటగిరీలో స్వల్ప తేడా ఉందన్నారు. అయితే ఒకసారి తీసుకుని శిక్షణ పొందిన తర్వాత అంతా దారిలో పడిపోతుందని అన్నారు.

బాలికలకు రాజకీయాలపై ఆసక్తి తక్కువే!

న్యూఢిల్లీ: మన దేశంలో బాలుర కన్నా బాలికలకు రాజకీయాలపై ఆసక్తి తక్కువగా ఉందని ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. ఆధునిక భావాలున్న కుటుంబాల్లోనూ ఆడపిల్లలు ఇంటి పనులు చేయాలనే అభిప్రాయంతో ఉన్నారని సర్వే తెలిపింది. 14-22 సంవత్సరాల మధ్య వయస్కులను ఇన్‌స్టాగ్రామ్ యాడ్ ద్వారా ప్రశ్నించినట్లు సంస్థ ప్రతినిధి తెలిపారు. రాజకీయాలతో తమకు సంబంధం ఉందని 51 శాతం మంది బాలురు, 29శాతం మంది బాలికలు చెప్పారని అధ్యయనం తెలిపింది.

అమెరికా భూగర్భ జలాల్లో పెరుగుతున్న లవణీయత

వాషింగ్టన్: అమెరికాలోని భూగర్భ జలాల్లో లవణీయత(ఉప్పు) ప్రమాదకర స్థితిలో పెరుగుతున్నదని ఆ దేశ జియోలాజికల్ సర్వే పరిశోధన తాజాగా వెల్లడించింది. దేశంలో ఒకదానికి ఒకటి అనుసంధానమైన 82 బావుల్లోని నీటి నమూనాలను విశ్లేషించగా, వాటిలో సోడియం క్లోరైడ్ స్థాయిలు పెరిగాయని నివేదికలో పరిశోధకులు పేర్కొన్నారు. మౌలిక వసతులు, ఎకో సిస్టం, జల జీవజాలంపై ప్రభావం పడిందని, ప్రజారోగ్యానికి ప్రమాదం పొంచి ఉందని నివేదిక హెచ్చరించింది.

కూలిన శిక్షణ విమానం

పుణె, అక్టోబర్ 22: పుణెలో ఒక ప్రైవేట్ శిక్షణ విమానం కూలిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. రెడ్‌బర్డ్ ఫ్లయిట్ ట్రైనింగ్ అకాడమీకి చెందిన శిక్షణ విమానం మహారాష్ట్రలోని పుణె జిల్లా గోజుబావి గ్రామం వద్ద ఆదివారం ఉదయం 8 గంటలకు కూలిపోయింది. ఈ ప్రమాదంలో ట్రైనీ పైలట్, శిక్షకుడు గాయపడ్డారు. వెంటనే వారిద్దరినీ దగ్గరలోని దవాఖానకు తరలించినట్టు బారామతి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ మోరె తెలిపారు. ప్రమాదానికి గల కారణం తెలియరాలేదని, దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ప్రైవేట్ శిక్షణ విమానం ఇలా కూలడం గత నాలుగు రోజుల వ్యవధిలో ఇది రెండోసారి. గురువారం కూడా ఒక శిక్షణ విమానం కూలింది. ఈ ప్రమాదంలో పైలట్ గాయపడ్డారు.

రేపటిలోగా రిజర్వేషన్లు ప్రకటించకుంటే నిరాహార దీక్ష

మరాఠా ఉద్యమకారుడు జరాంగే

ముంబై: ఈ నెల 24 నాటికి మరాఠాలకు రిజర్వేషన్లు మంజూరు చేయకపోతే, 25 నుంచి నిరవధిక ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని మహారాష్ట్ర బీజేపీ ప్రభుత్వాన్ని మనోజ్ జరాంగే హెచ్చరించారు. తమ డిమాండ్ నెరవేర్చే వరకు ఎంపీలు, ఎమ్మెల్యేలతో సహా రాజకీయ నాయకులను తమ గ్రామాల్లోకి అడుగు పెట్టనివ్వబోమన్నారు. ఆదివారం జల్నా జిల్లాలోని అంతర్వాలీ సరటి గ్రామంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఓబీసీ క్యాటగిరీ కింద మరాఠాలకు రిజర్వేషన్ల మంజూరుకు ప్రభుత్వానికి 40 రోజులపాటు గడువు ఇస్తూ ఆయన గత నెల దీక్ష విరమించారు.

మహారా